నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, మంగళవారం 6 మే 2025 | SIDDIPET

బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేత

హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మర్కూక్, మే 5: సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం వరదరాజ్‌పూర్‌లోని భూనీల సమేత వరదరాజస్వామి దేవస్థానం పునఃప్రతిష్ట బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఎమ్మెల్సీ కవిత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకు పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాల్‌రాజ్, అప్పాల ప్రవీణ్ అందజేశారు. సోమవారం హైదరాబాద్‌లో వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట ప్రవీణ్, నవీన్ తదితరులు ఉన్నారు.

సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

అన్నదాతల అరిగోస

- సిద్దిపేట మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం పరిశీలన
- అధికారుల తీరుపై ఆగ్రహం
- రైతులకు భరోసా కల్పిస్తూ ఓదార్చిన మాజీ మంత్రి

కొనుగోళ్లు వేగవంతం చేయాలి.. రైతుల గోస చూస్తే కడుపు తరుక్కుపోతుంది: ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, మే 5: రైతుల గోస చూస్తే కడుపు తరుక్కుపోతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. పలువురు రైతులు తాము మార్కెట్‌లో పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యేకు వివరించారు. రైతులకు భరోసా కల్పిస్తూ ఓదార్చారు.కొనుగోళ్లను వేగవంతం చేస్తామని ధైర్యం చెప్పారు. శనివారం మార్కెట్‌లో కాంటాపెట్టిన ధాన్యం బస్తాలను లారీలు లేక మిల్లులకు తరలించలేదని, దీంతో వర్షానికి ధాన్యం బస్తాలు తడిసిపోయాయని రైతులు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. మార్కెట్‌లో హమాలీలు, లారీల సమస్య ఉందని తెలుపగా వెంటనే డీసీఎస్‌వో, ఆర్డీవోకు ఫోన్‌లో మాట్లాడారు. లారీలు, హమాలీలను సమకూర్చకపోవడంతో ధాన్యం తడిసిందని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం, నిర్వాహకుల అలసత్వం వల్ల అన్నదాతలు అరిగోస పడుతున్నారన్నారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలన్నారు. కాంటా అయిన వెంటనే ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే ధాన్యం తడిసి ముక్కవాసన వస్తున్నాయని, మరో రెండు రోజులు ఉంటే మొలకలు వచ్చే అవకాశం ఉందన్నారు. డీసీఎస్‌వో మార్కెట్ యార్డుకు వచ్చి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని ఆదేశించారు. లారీ అసోసియేషన్ యజమానులతో మాట్లాడి లారీలను పంపాలని కోరారు. జిల్లాలోనే అతి పెద్ద మార్కెట్‌లో కొనుగోలు ప్రక్రియ ఇలా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. తడిసిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయాలని, నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో వారాల కొద్దీ కాంటాలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టార్పాలిన్లు లేక అకాల వర్షాలకు ధాన్యం తడిసిందన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు 72 గంటల్లోగా డబ్బులను బ్యాంకు ఖాతాలో జమ చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు మచ్చ వేణుగోపాల్ రెడ్డి, పాలసాయి రామ్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, నాయకులు గుండు భూపేశ్, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, నాయకులు దరిపల్లి శ్రీను, సుందర్, నర్సింహులు పాల్గొన్నారు.

సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు



సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం దర్గపల్లిలో మామిడి తోటలను పరిశీలిస్తున్న హరీశ్‌రావు

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

– మాజీ మంత్రి హరీశ్‌రావు

నంగునూరు, మే 5: అకాల వర్షాలతో పంటలు నష్టపోయి రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని దర్గపల్లిలో అకాల వర్షానికి దెబ్బతిన్న మామిడి తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. సిద్దిపేట నియోజకవర్గంలో 1800 ఎకరాల్లో మామిడి పంటకు నష్టం జరిగిందన్నారు. వ్యవసాయశాఖ, హార్టికల్చర్‌శాఖ, రెవెన్యూశాఖ అధికారులు పంటనష్టం అంచనావేసి తక్షణమే సహాయం అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత నెలలో ఐదుసార్లు వరుసగా అకాల వర్షాలు పడ్డాయని, మునుపెన్నడూ లేని విధంగా తీవ్రమైన గాలితో వర్షం కురిసిందని, దీంతో వరి, పండ్ల తోటల రైతులు నష్టపోయారన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా పూర్తిగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్లు ఎడ్ల సోమిరెడ్డి, రాగుల సారయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగంగౌడ్, మాజీ సర్పంచ్ బాలయ్య, జిల్లా హార్టికల్చర్ అధికారి సువర్ణ, మండల వ్యవసాయాధికారి గీత, ఆర్ఐ లింగం పాల్గొన్నారు.

ఐకేపీ నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే ధాన్యం తడిసింది

ధాన్యం జల్లి పట్టి నాలుగు రోజులు అయింది. గన్నీ బ్యాగులు ఇవ్వమంటే నంబర్ ప్రకారం ఇస్తామని చెప్పింద్రు. కానీ వాళ్లకు ఇష్టమొచ్చినోళ్లకు ఇచ్చింద్రు. ఆదివారం గాలి దుమారంతో కురిసిన వాన నన్ను ఆగం చేసింది ధాన్యం మొత్తం తడిసింది. కనీసం ఇక్కడ తాగేందుకు నీళ్లు కూడా పెట్టలేదు. చెట్ల కిందే సేదతీరుతున్నాం. ధాన్యం కొనుగోలు కేంద్రం ఒక దగ్గర ఉంటే గోనే సంచులు మరో దగ్గర పెట్టింద్రు. రైతులకు ఎలాంటి వసతులు కల్పించలేదు. బీఆర్ఎస్ సర్కార్ ఉన్నప్పుడు వసతులు మంచిగా ఉన్నాయి. ఐకేపీ నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే ధాన్యం తడిసింది.

– తన్నీరు యాదగిరి, రైతు, కొమురవెల్లి, సిద్దిపేట జిల్లా

ఆరుగాలం కష్టం వరదపాలు

ఆదివారం సాయంత్రం కురిసిన గాలి వానకు వరద వచ్చి మార్కెట్ యార్డులో ధాన్యం కొట్టుకుపోయింది. నాలుగు రోజుల క్రితం మార్కెట్ యార్డుకు ధాన్యం తీసుకొచ్చాం. వర్షం వల్ల వడ్లన్నీ తడిసిపోయాయి. ప్రభుత్వం వడ్లను కొనుగోలు చేయాలి. ఆరుగాలం కష్టం వరద పాలైంది. మమ్ముల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

– బాపురెడ్డి, రైతు, లింగారెడ్డిపల్లి, సిద్దిపేట జిల్లా

తేమశాతం రాలేదని ధాన్యం కొనలేదు

15 రోజుల కింద మార్కెట్‌కు నాలుగు ట్రాక్టర్ల ధాన్యం తెచ్చా. అధికారులు తేమశాతం రాలేదని ధాన్యం కొనలేదు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఒక బస్తా లారీ ఎక్కాలంటే రూ.30 వరకు ఖర్చు చేయకతప్పడం లేదు. ధాన్యం కొనకపోవడంతో ఆదివారం రాత్రి కురిసిన వానకు వడ్లన్నీ తడిసిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేయాలి.

–పాపయ్య, రైతు, ఎన్సాన్‌పల్లి, సిద్దిపేట జిల్లా

వడగండ్ల పాలైన పంట

ఆరుగాలం చేసిన పంట ఆదివారం కురిసిన వడగండ్ల పాలైంది. మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని వరిసాగు చేశా. ధాన్యం తీసుకువచ్చి కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టా. నిన్న ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన వర్షం వల్ల ధాన్యం తడిసింది. ఏంచేయాలోఅర్థం కావడం లేదు. సోమవారం ఉదయం వడ్లు ఆరబోసినం. ఇవి ఎప్పుడు ఎండుతాయో,ఎప్పుడు కాంటా అవుతాయో తెలియడం లేదు.

–నిమ్మనగొట్టు రాజయ్య, రైతు, కోహెడ, సిద్దిపేట జిల్లా

వడగండ్ల బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

- రైతుల సమస్యలు పట్టించుకోని అధికారులు
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- నియోజకవర్గంలో 40 వేల ఎకరాల్లో పంట నష్టం

రాయపోల్: రామారంలో వడగండ్ల వానతో నష్టపోయిన పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, అధికారులు

రాయపోల్, మే 5: వడగండ్ల బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కోరారు. సోమవారం సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం రామారం, దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామాల్లో వడగండ్ల వానతో నష్టపోయిన వరి పంటలను ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాలన అస్తవ్యస్తంగా మారిందన్నారు. జిల్లా అధికారులు, జిల్లా మంత్రులకు సమన్వయం లేక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందన్నారు. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లా అధికారులు, మంత్రులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి నష్టపోయిన రైతులకు పరిహారం అందించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతాంగం విపత్కర పరిస్థితిలో ఉన్నప్పటికీ జిల్లా అధికారులు స్పందించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలపై ఫోకస్ పెడుతున్న అధికారులు రైతులకు జరిగిన నష్టంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. దుబ్బాక నియోజకవర్గంలో వడగండ్ల వాన వల్ల సుమారు 40వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినా అధికారులు ఉదాసీన వైఖరి అవలంబించడం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ కార్యాలయాల్లో చాలా అవినీతి జరుగుతుందని, కిందిస్థాయి ఉద్యోగులను బదిలీ చేయడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. మండల తహసీల్దార్ శ్రీనివాస్, మండల ప్రత్యేకాధికారి బాబునాయక్, ఏపీఎం కిషన్, మండల వ్యవసాయాధికారి నరేశ్, మాజీ జడ్పీటీసీ యాదగిరి, బీఆర్ఎస్ రాయపోల్,దౌల్తాబాద్ మండలాల అధ్యక్షులు వెంకటేశ్వర శర్మ,సయ్యద్ రహీమొద్దీన్, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు రాజిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతులకు కడగండ్లు

తొగుట, మే 5: వడగండ్ల వానతో చేతికి వచ్చిన పంట నేలరాలిపోవడంతో రైతులు బోరుమని విలపిస్తుంటే వారికి భరోసా కల్పించాల్సిన కలెక్టర్ భూ భారతి మీటింగ్‌కు వెళ్లడం చూస్తే రైతులపై పాలకులకు ఏపాటి శ్రద్ధ ఉందో అర్థమవుతుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. వడగండ్ల వానతో సిద్దిపేట జిల్లా తొగుట మండలంలో పంటలకు తీవ్రనష్టం జరగ్గా కాన్గల్, లింగంపేటలో సోమవారం వరి పంటలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఆయన పరిశీలించారు. లింగంపేటలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగంపేట, కాన్గల్, తొగుట, పెద్దమాసాన్‌పల్లి, బండారుపల్లి, ఎల్లారెడ్డిపేట, ఘనపూర్, గుడికందుల, గోవర్ధనగిరి గ్రామాల్లో పూర్తి స్థాయిలో పంట, ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎకరాకు రూ.35 వేల పంట నష్టపరిహారం ఇవ్వాలన్నారు. తహసీల్దార్ శ్రీకాంత్, ఏవో మోహన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, సొసైటీ చైర్మన్ హరి కృష్ణారెడ్డి, నాయకులు చిలువేరి మల్లారెడ్డి, దోమల కొమురయ్య, కనకయ్య, వెల్పుల స్వామి, రమేశ్, నర్సింహులు, గొడుగు ఐయిలయ్య, యాదగిరి, ఎల్లం, ప్రవీణ్‌రెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్, అశోక్, మధుసూదన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీధర్, బైరాగౌడ్, మల్లయ్య, నర్సాగౌడ్, కరుణాకర్, స్వామిగౌడ్, రాములు, రాంబాబు పాల్గొన్నారు.

తొగుట మండలం లింగంపేటలో వడగండ్లతో నష్టపోయిన బంటుస్వామి పంటపొలాన్ని పరిశీలిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

బీఆర్ఎస్‌లో చేరికల జోష్

రాందాస్‌గూడ మాజీ సర్పంచ్ నారాయణను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

చిలిపిచెడ్, మే 5: కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మేటట్లు లేదని, అందుకే ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే స్వగృహంలో రాందాస్‌గూడకు చెందిన కాంగ్రెస్ మాజీ సర్పంచ్ నారాయణ, ఉపసర్పంచ్ పోచయ్య, శేఖయ్యను బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అంకం యాదగిరి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆహ్వానించారు. కార్యక్రమంలో చిట్కుల్ మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి,ఉప సర్పంచ్ సుధాకర్, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లపై సవాలక్ష కొర్రీలా ?

- బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మే 5: అధికారంలోకి వస్తే పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడేమో 60గజాలలోపే నిర్మాణం చేసుకోవాలని కొర్రీలు పెట్టడం దారుణమని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టి ఉత్తర ప్రగల్భాలు పలికిన నేతలు ఇప్పుడు మాటమార్చి ప్రజలను మరోసారి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ కార్యకర్తలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ కార్యకర్తలకు మాత్రమేనా.. పేదలకు ఇవ్వరా అని ప్రశ్నించారు. ధనవంతులైన కాంగ్రెస్ కార్యకర్తలకు ఇవ్వడం దారుణమన్నారు. అర్హులను కాదని కాంగ్రెస్ కార్యకర్తలకే ఇందిరమ్మ ఇండ్లు ఇస్తే ఊరుకునేది లేదని, పేదలతో కలిసి కాంగ్రెస్ కార్యకర్తలకు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. అకాల వర్షాలతో ధాన్యం తడిస్తే ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు లేదని, రైతులు పండించిన పంటను కొనుగోలు చేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉండడం సిగ్గుచేటన్నారు. మూడు నెలలుగా రైతుబీమా ప్రీమియం చెల్లించకపోవడంతో అనేక కారణాలతో మృతి చెందిన రైతులకు పరిహారం అందించడం లేదన్నారు.తులం బంగారం ఇవ్వడంలో కాంగ్రెస్ విఫలమైందని, ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. ముఖ్యమంత్రి నుంచి మొదలుకుంటే మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు ఎక్కడికక్కడ అవినీతికి పాల్పడుతూ అక్రమాలు చేస్తున్నారని ఆరోపించారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

- సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం గుర్రలసోఫ వద్ద రైతుల ధర్నా,రాస్తారోకో
- స్తంభించిన గజ్వేల్- చేగుంట రహదారి

ధర్నా చేస్తున్న రైతులను సముదాయిస్తున్న పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు

రాయపోల్, మే 5: సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని రామారం, దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం కురిసిన వడగండ్ల వాన వల్ల కోతకు వచ్చిన వరిపంట పూర్తిగా నేలరాలింది. సోమవారం ఉదయం రైతులు గుర్రలసోఫ వద్ద గజ్వేల్–చేగుంట రహదారిపై బైఠాయించి మూడు గంటల పాటు ధర్నా, రాస్తారోకో చేశారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సుమారు కిలోమీటరు పొడవునా వాహనాలు నిలిచిపోయాయి. వడగండ్లతో వరి పంట పూర్తిగా నేలరాలినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న రాయపోల్, దౌల్తాబాద్ పోలీసులు అక్కడికి చేరుకొని రైతులను సమదాయించినా వినిపించుకోలేదు. సంబంధిత వ్యవసాయశాఖ అధికారులు వచ్చి తమకు స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేదిలేదని రైతులు తేల్చిచెప్పారు. దీంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. పోలీసులు సంబంధిత అధికారులను అక్కడికి రప్పించారు. మండల ఏవో నరేశ్, మండల ఆర్ఐ భానుప్రకాశ్, దౌల్తాబాద్ ఎస్సై ప్రేమ్‌దీప్ రైతులను సముదాయించారు.ఈ సందర్భంగా ఏవో నరేశ్ మాట్లాడుతూ వడగండ్ల వానకు నేలకొరిగిన పంటల వివరాలు సేకరిస్తామని, తర్వాత పూర్తినివేదికను ఉన్నతాధికారులకు అందజేసి తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. వ్యవసాయ అధికారులు రైతులతో వెళ్లి పంటనష్టం వివరాలు సేకరించారు. రామారం, ఇందుప్రియాల్‌కు చెందిన రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం

- ఎక్కడికక్కడ ధాన్యం రాశులు
- ఇబ్బందులు పడుతున్న రైతులు

చేర్యాల, మే 5: సిద్దిపేట జిల్లా చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అందుబాటులో ప్యాడీ క్లీనర్లు లేక ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావించి ప్రైవేట్ వ్యక్తులు ప్యాడీ క్లీనర్ల అద్దె పెంచి సొమ్ము చేసుకుంటున్నారు. దీనికితోడు కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో లేక అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోతున్నది. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని కేంద్రాల్లో తరుగు పేరిట 50కిలోల బస్తా నుంచి 2కిలోల ధాన్యాన్ని తీస్తుండడంతో రైతులు నష్టపోతున్నారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని విక్రయించిన తర్వాత మిల్లులకు తరలించేవరకూ రైతులే బాధ్యత తీసుకోవాలని ఆంక్షలు పెడుతున్నారు. కొంత మంది మిల్లర్లు ధాన్యం సరిగ్గా లేదని గింజ పొడవు, చిన్నదిగా ఉన్నదని కుంటిసాకులు చెబుతూ ధాన్యం లారీల లోడులను వెనక్కి పంపిస్తున్నారు. దీంతో చేసేదేమీలేక రైతులు మిల్లర్లు పెట్టిన ఆంక్షలకు తలొగ్గి ధాన్యాన్ని విక్రయించాల్సిన దుస్థితి నెలకొంది. తీరా ధాన్యాన్ని అమ్మిన రైతులకు 48 గంటల్లో బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ అవుతాయని ప్రభుత్వం చెబుతుండగా 15రోజులైనా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సన్నధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనేక ఆంక్షలు పెడుతుండడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. కొనుగోలు కేంద్రాల్లో అనేక సమస్యల మధ్య రైతులు ధాన్యాన్ని అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

సిద్దిపేట జిల్లా ఆకునూరులో కొనుగోలు చేయకపోవడంతో ఎక్కడికక్కడ ధాన్యం రాశులు

సిద్దిపేట జిల్లా లద్నూర్‌లో వర్షానికి తడిసిన ధాన్యం

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

అర్జీలు స్వీకరిస్తున్న సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్

సిద్దిపేట, మే 5: సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి దోహదపడుతుందని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. సోమవారం సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణిలో భాగంగా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి ఆమె దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. భూసంబంధిత, హౌసింగ్, ఆసరా పింఛన్లు, ఇతర అర్జీలు మొత్తం 78 వచ్చాయన్నారు. ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని ఆమె అధికారులకు సూచించారు. డీఆర్వో నాగరాజమ్మ, డీఆర్డీవో జయదేవ్ ఆర్యా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా మద్దూరులో అసంపూర్తిగా ఇందిరమ్మ మోడల్ హౌస్

ఇందిరమ్మ మోడల్ హౌస్

నత్తనడకన కొనసాగుతున్న నిర్మాణ పనులు

మద్దూరు(ధూళిమిట్ట), మే 5: ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో భాగంగా తొలుత అన్ని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో లబ్ధిదారుల అవగాహన కోసం ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణాలను చేపట్టింది. దీనిలో భాగంగా సిద్దిపేట జిల్లా మద్దూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మూడు నెలల క్రితం ప్రారంభించిన ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీనికి తోడు నిర్మాణ పనులు నాసిరకంగా కొనసాగుతున్నాయి. నాణ్యతా ప్రమాణాలకు అధికారులు తిలోదకాలు ఇచ్చారు. కనీసం క్యూరింగ్ కూడా సరిగ్గా చేయడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మోడల్ హౌస్ నిర్మాణ పనులు ముందుగా పూర్తయితే అదే రీతిన ఇండ్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు అవగాహన కల్పించే అవకాశం ఉంది. ప్రస్తుతం అలాంటి అవకాశం లేకుండా పోయింది. మోడల్ హౌస్ నిర్మాణ పనులపై సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడం వల్లనే పనులు నత్తనడకన సాగుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. దీనిపై హౌసింగ్ డీఈ శంకర్‌ను వివరణ కోరగా కూలీలు దొరకకపోవడం వల్ల నిర్మాణ పనుల్లో జాప్యం జరిగిన మాట వాస్తవమేనని, 15 రోజుల వ్యవధిలో మోడల్ హౌస్ నిర్మాణ పనులు పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.